# ఒక దీపం వెలిగించావా

కప్పగంతుల శ్రీకృష్ణ బహదూర్



సాయంత్రం ఆరు గంట లవుతోంది.

టాంక్‌బండ్ రోడ్‌లో తన ఎఱ్ఱ రంగు రోవర్ కారుని మెల్లగా నడుపుతున్నాడు శ్రీరామ్. హుస్సేన్‌సాగర్ మీద నుండి చల్లని గాలి వస్తోంది. ఎంతోమంది ప్రజలు ఆ కారు వైపే చూస్తున్నారు. 'అలాంటి కారు మనకీ ఉంటేనా!' అని ఈర్ష్యతో కొందరు 'ఎంత బావుం దీ కారు!' అని కొందరు, 'ఎవ రున్నా రీ కారులో?' అని కొందరు చూస్తున్నారు.

అస్తమిస్తున్న సూర్యుడి కిరణాలు కారుమీద పడుతున్నాయి. అవి పడిన చోటల్లా తళతళ లాడి మెరుపు కనిపిస్తోంది. చూసే వాళ్ళకి కళ్ళు చెదురుతున్నాయి.

శ్రీరామ్ ఆలోచిస్తూ కారు నడుపుతున్నాడు. ఆరూ ముప్పావుకి రవీంద్ర భారతిలో డాన్స్ ప్రోగ్రాం ఉంది. బంజారాహిల్స్‌లోని తమ ఇంటికి వెళ్ళి తల్లి పార్వతిని తీసుకురావడానికి వీలు ఉంది.

'డాన్స్ చెయ్యబోయే మైథిలిని నీకు కాబోయే కోడలుగా ఒప్పుకుంటావా?' అని అడిగితే తల్లి ఏమంటుందా అనే అతని ఆలోచన.

ముషీరాబాద్‌లోని తన ఆఫీస్ నుండి బయల్దేరి నప్పటినుండి ఇదే ఆలోచన.

వారం రోజుల క్రితం మైథిలి తనని వెతుక్కుంటూ ఆఫీస్‌కి వచ్చి ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందించింది. వారం రోజుల్లో పాత జ్ఞాపకాలు ఇద్దరి మనసుల్నీ ఊపివేశాయి. మైథిలి భర్త శంకర్ చనిపోయి రెండేళ్ళయిందిట. అతని మరణానికి ముందు అంతిమ కోరిక ప్రకారం అతని డాన్సింగ్ స్కూల్ మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ ఆపేయకూడదని, ఆమె డాన్స్ బాగా నేర్చుకుని ప్రదర్శనలు ఇస్తోంది.

భర్తమీద ప్రేమ లేకపోయినా, ఆమె కుటుంబాన్ని ఆపదల్లో నుండి కాపాడినందుకు మైథిలికి కృతజ్ఞత ఉంది. అందుకే ఆ స్కూల్‌ని నడుపుతూనే ఉంది.

హైదరాబాద్ రాగానే శ్రీరామ్‌ని వెతుక్కుంటూ వచ్చింది. శ్రీరామ్ పెళ్ళి చేసుకోలేదని తెలియగానే ఆమెకు, ఆమె భర్త మరణించాడని తెలియగానే శ్రీరామ్‌కు తమ పాత ప్రేమ చిగుర్చింది. పార్వతికి ఆమెను చూపా లనుకున్నాడు శ్రీరామ్. కానీ, అతని ఆఫీస్ వర్క్ వలన, ఆమె ప్రోగ్రాం వర్క్ వలన ఎక్కువ టైమ్ దొరకలేదు. దొరికిన టైమ్ వాళ్ళు కలిసి మాట్లాడుకోవడానికే చాలలేదు.

పెళ్ళి చేసుకుందామని ఇద్దరూ అనుకున్నారు.

"మీ అమ్మగారికి నేను డాన్సర్ నని తెలియాలి. నేను విధవని అనీ తెలియాలి. ఇవి తెలిసీ ఆవిడ ఒప్పుకుంటేనే అప్పుడు నేను పెళ్ళికి ఒప్పుకుంటాను. ముందు ఆవిడని డాన్స్ చూడనీయండి'' అం దామె.


"డాన్స్ చూసి మా అమ్మ నిన్ను ఇష్టపడుతుందని భావిస్తున్నావా?'' నవ్వుకుంటూ అడిగాడు శ్రీరామ్.

"అది కాదు నా ఉద్దేశం. స్టేజ్ మీద నేను ఆడితే నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటారు. అందరూ పెద్దమనుషులు కారు. చవకబారు విమర్శలూ వస్తాయి. వాటిని విన్నాక నన్ను ఆమె కోడలుగా అంగీకరించగలరా అని గ్రహించడానికి!'' గంభీరంగా అంది మైథిలి.

"నేను చెప్తున్నాను కాబట్టి గొప్పగా వినిపించవచ్చును. కానీ విని ఆలోచించి చూడు. నేను ప్రేమించాను కాబట్టి పెద్ద మనసుతో నిన్ను ఆదరిస్తున్నాను, లేకపోతే నీలాంటి దాన్ని చేసుకుంటానా అని అడిగితే నేను ఎస్ అంటాను. కానీ, మా అమ్మకి అంత విశాల దృక్పథం ఉండకపోవచ్చును, మైథిలీ!''

"అయితే నువ్వు ఇంతకాలం ఎందుకు పెళ్ళి చేసుకోలేదు?''

"నీమీద ప్రేమ వలనే. మగవాడు అంత సులభంగా పరిస్థితులకి రాజీ పడలేడు. నువ్వు నాకు దక్కలేదని బాధపడ్డాను. నిజమైన ప్రేమికుడు ప్రేమను కాదన్నా ఆ తిరస్కారాన్ని కూడా ప్రేమతో స్వీకరిస్తాడు. నేను నిన్ను ద్వేషించలేదు. మర్చిపోలేదు. ఇంకో స్త్రీని అంగీకరించలేకపోయాను కూడా. ఈ రోజు నువ్వు తిరిగి నా దానివి కాబోతున్నావంటే నీలో లోపాలు ఎంచను నేను. కానీ, మా అమ్మ సంగతి నేను చెప్పలేను.''




"శ్రీరామ్! మీ అమ్మగారికి నువ్వు ఒక్కడివే కొడుకువి. నీ కోరిక తీర్చడానికి ఆవిడ ఒప్పుకోవచ్చు. కానీ, తర్వాత నన్ను అసహ్యించుకోవచ్చు. అందుకని ఆవిడకి ఎలాగూ అన్ని సంగతులూ చెప్పినా, ప్రత్యక్షంగా అనుభవం పెళ్ళికి ముందే జరిగితే తర్వాత సర్దుకుపోవడం సులభం అవుతుంది.''

"ఏమో మరి, స్త్రీ హృదయం స్త్రీకే అర్థ మవ్వాలి. అలాగే చేద్దాం'' అన్నాడు శ్రీరామ్.

ఆలోచిస్తూ ఇంటికి చేరా డతను. పార్వతి పుస్తకం చదువుకుంటోంది. కొడుకు రాగానే చూసి పలకరింపుగా నవ్వింది.

"హమ్మయ్య, తీరిగ్గానే ఉన్నా వామ్మా! ఇవ్వాళ ఒక డాన్స్ ప్రోగ్రాం ఉంది. నిన్నూ తీసుకువెళ్తాను. తయారవ్వు'' అన్నాడు.

"ఎవరి డాన్స్? ఎక్కడ?'' అంది పార్వతి.

"మైథిలి డాన్సమ్మా. రవీంద్రభారతిలో.'' తల్లివైపు చూడకుండా చెప్పాడు శ్రీరామ్.

పార్వతి అతని వైపు చురుగ్గా చూసింది.

"మైథిలి అంటే? ఆ అమ్మాయేనా? నువ్వు కాలేజీలో ఉండగా ఇష్టపడ్డావు. తర్వాత వేరే ఎవర్నో పెళ్ళి చేసుకుంది'' అంది పార్వతి.

"అవు నమ్మా!''

"ఇప్పుడు మళ్ళీ వచ్చిందా? ఎందుకు?''

"అన్నీ దారిలో చెప్తాను. నువ్వు బయల్దేరు'' అన్నాడు శ్రీరామ్ ఆమె వైపు తిరిగి.

ఆమె తల ఊపింది.

** ** **

కొడుకు చెప్పినవి గుర్తు వస్తూంటే మనసు గజిబిజిగా ఉండి డాన్స్ చూస్తోంది పార్వతి.

మైథిలి ఒక విధవ. ప్రేమించాడు కాబట్టి తన కొడుకు విధవా వివాహానికి సిద్ధపడుతున్నాడు. ఆమె తను ఒప్పుకుంటేనే ఈ పెళ్ళి జరగాలి అంటోంది. వాళ్ళ మధ్య పరస్పర ప్రేమ, అవగాహన ఉంటే మధ్య తనకేం అభ్యంతరం లేదు. కానీ, ఒక్కటే తనకు నచ్చలేదు. డాన్స్ చెయ్యడం. డాన్స్ మీద తనకి పెద్దగా అభిమానం లేదన్న సంగతి నిజమే. కానీ, డాన్స్ చేసే వాళ్ళ మీద చిన్న చూపు లేదు. అసలు ఎటువంటి అభిప్రాయం లేదు. అందుచేత తన కోడలు 'డాన్సర్' అని తక్కువగా ఊహించుకోడానికి ఆస్కారం లేదు. ఆమె డాన్స్ చెయ్యడం తనకి ఇష్టం లేకపోవడానికి కారణం ఒక్కటే!

అది ఎలా చెప్పడం?

కొడుక్కి చెప్పాలా, ఆమెకి చెప్పాలా? చెప్పినా తన మాట వినకుండా డాన్స్ చేస్తానంటే?

పెళ్ళి ఆపగలదా?

ప్రేమలో ఉన్న వాళ్ళనీ ఆపడం కష్టం. కొడుకు ఇష్టం అని బాధ్యత వాడికి వదిలేయవచ్చును. కానీ, నూటి పోటి మాటలు తగులుతాయి. తను భరించగలదా? ఇది తెలుసుకోవడానికే మైథిలి తనని డాన్స్ చూడ్డానికి పిలిచిందా? ఇప్పుడే తనని పరీక్షిస్తోందంటే ఈ కోడలి వలన ముందు ముందు తనకి తిప్పలు తప్పవు!

ఉన్నట్టుండి ప్రేక్షకుల కరతాళధ్వనులు వినిపించాయి. ఉలిక్కిపడింది పార్వతి.

డాన్స్ అయిపోయింది. అందరూ లేస్తున్నారు. పార్వతి కూడా యాంత్రికంగా కదిలింది.

"అమ్మా! మైథిలిని చూద్దామా?'' అడిగాడు శ్రీరామ్.

"వద్దు. రేపు ఇంటికి తీసుకురా. ఇప్పుడు వెళ్ళిపోదాం'' అంది.

ఇద్దరూ జనంతో కలిసి నడవసాగారు.

"ఈ డాన్సర్ ఎవరో తెలుసునా?'' ఎవడో అన్నాడు.


"ఓ ఐ సీ! బాగా చేసింది. మంచి ఫిగర్.''

"ఫిగరూ, ఆమె సంసారం గురించా

## గాడిద గొప్పదే

గాడిద మీద స్వారీ చేస్తే పంటి నొప్పి, కోరింత దగ్గు, కీళ్ళ నొప్పులు వంటి అనేక వ్యాధులు నయం అవుతాయని ఐస్‌లాండ్ దేశస్థుల నమ్మకం. ఏసుక్రీస్తు స్వారీ చేసిన ఏకైక జంతువు గాడిదే కాబట్టి దానికి జంతువులన్నింటిలోఎక్కువ మహత్తు ఉందని ఆ దేశవాసుల నమ్మకం.

సేకరణ: ముద్దా రమణమూర్తి (అనంతపురం)



# అలుక తీరి కలిసేదే అందమైన బంధం

ఆడవారికి తమ తీరని కోరికల వలన కలిగే కోపమే 'అలుక'. అలా కోరికలను తీర్చుకోవడం కోసమే అలుక అనే ఆయుధాన్ని పురుషుడిపై ప్రయోగిస్తూంటారు. అందుకేనేమో ఓ కవిగారు 'అడపాదడపా ఇద్దరూ అలిగితేనే అందం, అలుక తీరి కలిసేదే అందమైన బంధం' అన్నాడు. అలుకనేది అతివలకే అందంగా ఉంటుంది. మగవారు అలిగితే బాగుండదు.

ఇక అతివల అలుక విషయంలో మల్లెపూల నుండి మొదలుకొని నగలు, పట్టుచీరల వరకూ సాధించవచ్చు. అయితే అలుకే వీరి కోర్కెలను తీర్చుకునే మార్గం కాదు. కాని కోర్కెలను తీర్చుకునే మార్గాలలో ఒకటని చెప్పవచ్చు. ఆ ప్రయత్నాలలోనే ... ఇంటికి వచ్చిన భర్త రాకను చూసీ చూడనట్లుగా నటిస్తూ మూతి బిగింపులతో మాట్లాడక అటు తిరిగి పడుకుంటారు. భర్త బతిమాలేకొద్దీ బిర్రబిగుసుకుంటారు. కొందరు బుంగమూతి పెట్టి మాట్లాడకుండా సైగలతోనే ప్రవర్తిస్తూంటారు. మరికొందరు చిందులు తొక్కుతూ బుడిబుడి దీర్ఘాలతో దెప్పిపొడుస్తూ ఉంటారు.

మొదట బిగదీసుకున్నా దారికొచ్చి తన అలుకలోని కోర్కెని నెమ్మదిగా, ముద్దుగా వెల్లడిస్తారు. ఇక భర్త భార్య అలుకలోని కోర్కెకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే ఒక విధమైన గిల్టీ ఫీలింగ్‌తో అందంగా సిగ్గుపడుతూ ఆయనగారి మతి పోగొడతారు.

ఈ అలుకలలో కూడా కొన్ని కొన్ని సందర్భాలలో పట్టు విడుపు లుండాలి. మరీ తెగేదాకా లాగడం వలన చిలికిచిలికి గాలివానై అన్యోన్యమైన భార్యాభర్తల మధ్య కలహాలకు దారితీసేలా ఉండకూడదు. ఏమైనా అలుకలు కొద్దిసేపు ఉంటేనే అందం. శ్రుతిమించిన అలుకలు అనర్థాలకు దారితీస్తాయి. అలా అస్తమానం అలుగుతుంటే భర్తకి వెగటు పుట్టి బెడిసికొట్టే ప్రమాదం కూడా ఉంది. ఇంకా చెప్పాలంటే సమయం, సందర్భం పాటించని అలుకలు కోపతాపాలకు దారితీస్తాయి. ముఖ్యంగా అలుకలతో సాధించాలనే కోర్కెలు - అవి భర్తలు తీర్చగలిగేవిగా ఉండాలి. శక్తికి మించిన కోర్కెలు అలుకలవల్ల తీరేవి కావు. అలుకలు ముచ్చటగొలిపేవిగా ఉండాలి గాని, మూర్ఖంగా ఉండకూడదు. అలవికానిచోట అధికుల మనరాదు అన్నట్లు మన అలుకలు గుర్తించని, గుర్తించలేని, సరసం తెలియనిచోట అలుకలు వ్యర్థం. వాటికి అర్థమే ఉండదని గమనించాలి.

మహిళల అలుకలకు కారణం తెలుసుకుని తీర్చగలిగినవైతే, ఆ కోర్కెలను తీర్చడమే మంచిది. ఎందుకంటే తీర్చగలిగిన కోర్కెలను తీర్చలేనినాడు కోపం మరింత పెరిగి ఎదురు తిరిగి ముఖాముఖి కీచులాటలు జరిగే ప్రమాదముందని పురుషులు కూడా గ్రహించాలి.

ఇలా కొన్ని జాగ్రత్తలు పాటిస్తూ అలుక అనే ఆయుధాన్ని భర్తలపై సంధించినా, అవి అనర్థాలకు దారితీసేలా కాకుండా అందంగా, శాంతంగా తమ కోర్కెలను సాధించుకోవచ్చు. అలా భార్య అలుక తీరినప్పుడు కనిపించేదే అందమైన అనుబంధం: ఇద్దరిలోనూ ఆనందం వెల్లివిరుస్తుంది.

**ఆర్. విజయలక్ష్మి ధనుంజయ**
[దేవునికడప]

---

చూస్తారు. డాన్స్ బాగా చేసింది. అది చూడాలి."

"స్టేజీ మీదకి వస్తే అన్నీ చూస్తామోయ్."

ఎవరో ముగ్గురు మాట్లాడుకుంటూ వెళుతున్నారు. పార్వతి కొడుకు వైపు చూసింది. అతని మొహం ఎర్రగా మారిపోయింది. తల్లి వైపు చూసి తత్తరబాటుతో చూపులు మరల్చాడు.

పార్వతికి అర్థమైపోయింది.

ఇవన్నీ తన భావాలు తెలుసుకోవడానికి మైథిలి మాట్లాడించిన మాటలు!

కానీ, తనకన్నా ముందు కొడుక్కే ఇవి నచ్చలేదు!

కొందరు మగవాళ్లు తమ భార్యని ఎవరైనా వర్ణిస్తే సహించరు.

అలాంటి వాడే తన కొడుకు!

తన ప్రశ్నకి సమాధానం దొరికింది!

ఇంక నేర్పుగా మైథిలి మనసు మార్చాలి!

తల్లీ కొడుకులు ఇంటికి వచ్చారు.

శ్రీరామ్ మనసు చిరాగ్గా ఉంది. తనకి విశాల దృక్పథం ఉందని మైథిలి ముందు అన్నాడు కానీ, ఇప్పుడు భరించడం కష్టంగా ఉంది.

ముందు ముందు అసలు భరించలేడు.

ప్రేమ వివాహం డైవోర్సులోకి దిగుతుంది!

ఛ! ఏం చెయ్యడం?

మైథిలి డాన్స్ మానేయమంటే మానేయదు. ఎలా?

అసహనంగా తల విదిల్చాడు.

అతన్ని జాగ్రత్తగా గమనిస్తున్న పార్వతి తనలో చిన్నగా నవ్వుకుంది.

"ఏదో అప్‌సెట్ అయినట్టున్నావు. ఏమిట్రా?" అంది.

"అక్కడ మనం విన్న విమర్శలు. అలాంటివి భరించగల ననుకున్నాను. కానీ, చిరాకుగా ఉందమ్మా!" బాధగా మొహం పెట్టాడు శ్రీరామ్.

"లోకం అంతే మరి. పలుకుబడి, పేరు ఉన్న వాళ్లని, పదిమందిలోకి వచ్చే కళాకారులని మంచి మాటలు అనరు. ఇవేం కొత్తగా చెప్పాలా? సినిమా తారలని అనే మాటలు విన్నావంటే ఎంత చవకబారుగా ఉంటాయో తెలుస్తుంది. పడే వాడికి తెలుస్తుంది బాధ. అనే వాడికేం?" అంది.

"అది కాదమ్మా!"

"సరేలే. ఆలోచించుకుని ఏదైనా మాట్లాడు. తొందరపడి మాట్లాడకు. నీకు ఇంకా ఒక విషయం తోచలేదు. నా కిప్పుడే తోచింది. అది రేపు మైథిలి వచ్చాక మాట్లాడుతాను, అందరం మాట్లాడాక నిర్ణయం తీసుకుందాం. ఇంక పడుకోవాలి నేను. అలసటగా ఉంది" అంది.

"ఊఁ. సరే, అయితే" అన్నాడు శ్రీరామ్.


**ము**గ్గురూ హాల్లో కూర్చున్నారు. మైథిలి అందగత్తె. కొన్నేళ్ల క్రితం ఉన్న పచ్చని వయసులోని అందం ఇంకా మెరుగులు దిద్దుకుంది. తన కొడుకుని ఆమెలో అంతగా ఆకర్షించిన దేమిటో నిన్న చూసిన వెంటనే పార్వతి ఊహించగలిగింది. దూరం నుండి చూడడం వలన అంత గ్రహించలేకపోయినా, ఇప్పుడు ఎదురుగా కూర్చుని చూస్తూంటే మైథిలి అందం ఎంత మత్తెక్కిస్తుందో అర్థమైంది.

అందం ఒక్కటే చాలదు. ఈ అమ్మాయి తన్నే పరీక్ష చేద్దామని చూసింది. అంటే తెలివైనదే. ఇవి రెండూ కూడా మనిషికి చాలవు. మనిషిని మనిషి చేసేవి మంచి గుణాలు. అందరూ అన్ని సందర్భాలలో మంచిగా ఉండరు. అందుచేత ఈమె సాధారణంగా మంచి మనిషా, కాదా అన్నది తెలుసుకోవాలి. ఏం చెయ్యడం?

మామూలు కబుర్లు, కొన్ని వ్యక్తిగత వివరాలు ప్రశ్నించడం అయిపోయింది.

ఆమె తండ్రి మరణించారు. తల్లి ఉంది.

---



### అన్యోన్యత

"నా భార్య, నేనూ అన్యోన్యంగా ఉండలేకపోతున్నాంరా! ఓ సలహా చెప్పవూ?"

'మరేంలేదు. ఒకరికొకరు పరస్పరం సహకారంతో ఉంటే సరి!"

"అంటే? కాస్త వివరంగా చెప్పరా!"

"అదేనోయ్ మీ ఆవిడ నీ కర్చీఫ్ ఉతికి పెట్టిందనుకో. నువ్వు మీ ఆవిడ చీరని ఉతికి పెట్టాలి... అంతే!"

"భోశ్రీ" హైదరాబాదు)

ఆమెకు పిల్లలు లేరు. ఇంక అసలు విషయానికి రావాలి. అందరూ నిశ్శబ్దంగా ఉన్నారు. పార్వతి గొంతు సవరించుకుంది.

"అమ్మాయ్ మైథిలీ! నువ్వు డాన్స్ చెయ్యడం తప్పుదంటావా?"

"డాన్స్ నా భర్త కోరిక నిలవడానికి చేస్తున్నాను."

"ఏమి టది?"

"ఆయనకి డాన్స్ స్కూలు ప్రాణం. దాన్ని ఎన్నడూ ఆపవద్దని నా దగ్గర వాగ్దానం తీసుకున్నారు."

"డాన్స్ స్కూలు నడపడానికి నువ్వెందుకు డాన్స్ చెయ్యాలి?" అన్నాడు శ్రీరామ్.

"డబ్బు కావాలి కదా!" అంది మైథిలి నెమ్మదిగా.

ముగ్గురూ మౌనంగా ఉండిపోయారు.

"అమ్మాయ్ మైథిలీ! శ్రీరామ్‌ని పెళ్లి చేసుకుంటే అతను నీకు భర్త అవుతాడు కదమ్మా!" అంది పార్వతి.

"అవును?"

అసలు సంగతి ఎలా ఎత్తాలో తెలీక, సంస్కారం అడ్డు పడుతూంటే ఆమె మైథిలి గ్రహించగలదా అని ప్రయత్నించి చూస్తోంది. శ్రీరామ్ గ్రహించాడు.

"మైథిలీ! నేను భర్త నయ్యాక నువ్వింకా మరణించిన భర్త జ్ఞాపకార్థం స్కూల్ నడుపుతాను, అందుకు డాన్స్ చేస్తాను అంటే మా కెలా ఉంటుంది. లోకం ఏమంటుంది? లోకం అనే మాటలు కొన్ని శాంపుల్ నిన్న విని మేము, ముఖ్యంగా నేనే భరించలేకపోయాను. నువ్వు నా భార్యవయితే ఇలాంటి మాటలు అసలు సహించలేను" అన్నాడు శ్రీరామ్ సీరియస్‌గా.

మైథిలి దిమ్మెరపోయి చూసింది.

ఎక్కడ పోయిం దీ 'విశాల దృక్పథం' అని చెప్పిన మాట!

విధవా వివాహం చేసుకుంటారు గానీ ఆమె పాత జ్ఞాపకాలనీ, జీవితాన్ని చేసుకోరు. అ దొకటీ, రెండోది తనలోని కళ పదిమందిలో ప్రదర్శించడం పలుకుబడిని నిలదీస్తోంది!

అందుచేత తను డాన్స్ చెయ్యకూడ దంటారు ఇంక!

తను చెయ్యగలదా ఈ రెండు పనులూ?

"నా చనిపోయిన భర్త శంకర్‌గారు మా నాన్నకి ఆఫీసులో పై అధికారి. అన్యాయంగా మా నాన్నమీద ఇంకో అధికారి నేరం మోపడం వలన ఆయన ఉద్యోగం పోవడమే కాక, లక్ష రూపాయలు డబ్బు కట్టాల్సొచ్చింది. మా నాన్న దుఃఖం చూసి మావారు ఆ డబ్బు కట్టారు. చాలా రోజులు గడిచాక ఆఫీసులో మోసం బయటపడింది. అదీ మావారు చేసిన ప్రయత్నం వల్లనే.

"ఆయన లక్ష రూపాయలు ఆయన తీసుకున్నారు. ఈలోపల ఉద్యోగం పోయిన నాన్న దిగులుతో మంచం పట్టారు. ఆయనకి వైద్యం చేయించడానికి మావారే ముందుకు వచ్చారు. ఆయన ధైర్యంగా, అండగా ముందుకు రాకపోతే మా కుటుంబం రోడ్డున పడి ఉండేది. ఆయన మీద కృతజ్ఞతతో మా నాన్న ఏం చెయ్యాలో తెలీక కొట్టుమిట్టాడారు. అప్పుడే ఆయన మా నాన్నతో నన్ను పెళ్లి చేసుకుంటానని అన్నారు. నాన్న ఆనందం అంతా ఇంతా కాదు. ఆయన కృతజ్ఞత ఇంకా ఎక్కువైపోయింది. నేను పెళ్లికి మొదట ఒప్పుకోలేదు. కానీ, నాన్న తన బాధ చెప్పుకుని బ్రతిమాలుకున్నారు. బలవంతం చేసి ఉంటే నేను వేరేగా ఉండేదాన్ని. నాన్న అలా వేడుకుంటూంటే నేను భరించలేక పెళ్లికి

## గురి కుదిరింది!

ఒళ్లంతా కట్లు గట్టుకున్న ఒక భర్త విడాకులకోసం కోర్టు కెళ్లాడు.

"నా భార్యతో కలిసి ఉండటం చాలా ప్రమాదకరం సార్! పెళ్ళయిన దగ్గరనుంచీ చూస్తున్నాను, చేతిలో ఏదుంటే అదే విసిరేస్తుంది మీదకు!"

"మరి అలాగే ఇరవై ఏళ్లు సంసారం చేశావు కదా! ఇప్పుడు విడాకు లెందుకు?" అడిగాడు జడ్జి.

"ఇప్పుడు ఖచ్చితంగా గురి తప్పకుండా కొట్టగలుగుతోంది!" అంటూ జవాబిచ్చా డా వ్యక్తి.


వి. బాలకృష్ణ [పామర్రు]

## అనువత్రి మనకూ తెలుసు

అనువత్రులన్నవి బ్రిటిష్ వారి భిక్షలేనని మనలో చాలా మంది అపోహ పడుతూంటారు. కానీ కనీసం 925 సంవత్సరాలకుపూర్వమే మన దేశంలో అన్ని హంగులతో వైద్యశాలలు ఉండేవనడానికి శిలా శాసన సాక్ష్యం ఒకటి ఉందండి.

తమిళనాట చింగల్‌పేట్ జిల్లాలో తిరుముకూడల్‌లో పాలార్ నదీ, ఉప నదులు వేగావతి, చెయ్యూరులు సంగమించే చోట ఒక విష్ణ్వాలయం ఉంది. అక్కడ లభించిన శాసనం ప్రకారం ఆ ఆలయ ప్రాంగణంలో 15 పడకల అనువత్రి ఉండేది. క్రీ శ. 1069 నాటి ఆ శాసనంలో అనువత్రిలో నిలవ ఉంచిన ఔషధులను గురించి, వాటి ఉపయోగాన్ని గురించి, వైద్యులు, నర్సులు, కాంపౌండర్లు తదితర సిబ్బంది జీతభత్యాల గురించి, జబ్బుల గురించి స్పష్టమైన వివరా లున్నాయి.

నిజానికి ఆ ఆలయం పల్లవుల కాలంనాటికే అంటే 9వ శతాబ్దానికే ఉందికాని అనువత్రి అప్పటి నుంచి ఉందా లేదా అన్న విషయం మాత్రం తెలియడంలేదు. చోళరాజు వీరరాజేంద్ర కాలంలోని వివరాలనే శాసనాలు తెలుపుతున్నాయి. అనువత్రి గురించి, అక్కడే ఏర్పాటైన వేద విద్యాలయం, హాస్టళ్ల గురించి అతి వివరంగా తెలియచేస్తున్న ఆ శాసనాల గురించి సుమారు 80 ఏళ్ళ క్రితమే శ్రీ



కె.వి.సుబ్రహ్మణ్య అయ్యర్ [శిలా శాసన అధ్యయనకారుడు] ప్రకటించారు. ఆ శాసనాల్లో ఉపాధ్యాయుల జీతభత్యాల గురించే కాక విద్యార్థుల తిండితిప్పల చిట్టా కూడా ఉంది. విద్యార్థులు ఉపయోగించే దీపాల్లోకి నూనె ఖర్చు, శనివారాల్లో తైలస్నానాల ఖర్చు కూడా ఆ శాసనాల్లో రాశారు.

అనువత్రిలోఒక వైద్యుడు [అధికారి కూడా] ఇద్దరు శస్త్ర చికిత్సకులు, మూలికల సేకరణకారులు [నేటి రిప్రజెంటెటివ్‌ల లాంటి వారు కావచ్చు] ఇద్దరు నర్సులూ ఉండేవారు. ఎలాంటి శస్త్ర చికిత్సలు జరిగాయో తెలియకున్నా మంగలి పనిచేసే వ్యక్తే శస్త్ర చికిత్సలూ చేసినట్లుంది. నేటికీ తమిళనాడులోని కొన్ని గ్రామాల్లో గడ్డలు లాంటి చిన్న చిన్న శస్త్ర చికిత్సలు మంగలివారు చేస్తూనే ఉన్నారు. జీతాలు ఉద్యోగి స్థాయినిబట్టీ, పనిని బట్టీ వేరు వేరుగా ఉండేవి. జీతమంటే, ధాన్యమూ, బంగారు నాణాలూనూ.

ఆ అనువత్రిలోని మందుల్లో జ్ఞాపకశక్తిని పెంచేవి, విజ్ఞానాన్ని అభివృద్ధి పరిచేవి. అలసటను పోగొట్టే శక్తి వర్ధకాలూ, దీర్ఘాయువు కలిగించేవి కూడా ఉండేవి. ఆ శాసనాలను మరింతగా అధ్యయనం చేస్తే నేటికి పనికి వచ్చే ఔషధాల గురించి తెలిసే అవకాశం ఉంటుంది.

విష్ణ్వాలయానికి అనువత్రిని అనుసంధానించడానికి విష్ణువుని జబ్బులు తగ్గించే దైవంగా భావించడమే కారణం కావచ్చునని ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ టి.సత్యమూర్తి పేర్కొన్నారు. ఆయన ఇంత వివరంగా ఔషధాలు, అనువత్రి నిర్వహణ గురించి తెలియచేసిన శాసనాలు మరెక్కడా లేవంటున్నారు.

అయినా ఏ పుట్టలో ఏ పామున్నదోనని వెతికే వారికి ఇలాంటి ఘన ఘనత తెలియపరిచే శాసనాలు ఇంకెన్ని లభిస్తాయో!

ఒప్పుకున్నాను." మైథిలి చెప్పడం ఆపింది.

వా ళ్లిద్దరూ కుతూహలంగా వింటున్నారు.

మైథిలి మళ్లీ మాట్లాడింది!

"మా నాన్నని, అమ్మని పెళ్లయ్యాక ఆయన తన వాళ్లతోనే ఉండ మన్నారు. ఆయనకి ఆఫీసులో ఉద్యోగమే కాక ఒక డాన్స్ స్కూల్ కూడా ఉంది. అది ఆయనకి ప్రాణం. ఉచితంగా కొందరికి డాన్స్ నేర్పేవారు కూడా. దాని పనులు కొంత నాన్న చూడసాగారు. కొన్నాళ్లకి మా అమ్మకి జబ్బు చేసింది. ఆమెకి వైద్యం చేయించారు మావారు. మా అమ్మ ఈనాటికీ బ్రతికి ఉందంటే ఆయనే కారణం. ఆయన యాక్సిడెంట్‌లో పోయారు. ఈ డాన్స్ స్కూల్ నేను నడపాలని ఆయన చనిపోతూ కోరారు. నేను ఆయన్ని ప్రేమించలేదు. అయినా, నేను సరే నన్నాను. ఆయన డబ్బు ఆ స్కూల్ కోసం, మా అమ్మకి వైద్యం కోసం ఖర్చయిపోయింది. డబ్బు కోసం అందం ఉన్న నేను గజ్జె కట్టాను. డబ్బూ, పేరూ వచ్చాయి. మావారి కోరిక తీర్చగలుగుతున్నాను. మా కుటుంబానికి ఇంత చేసిన ఆ మంచి మనిషిని నేను మరవకూడదు. అలా మరిస్తే నేను మనిషినే కాదు. కృతజ్ఞత చూపలేని వాళ్లు పశువుల కన్నా హీనమే కదా. కాదంటారా?" గంభీరంగా అంది మైథిలి.

పార్వతి చలించిపోయింది. ఆమె సందేహానికి సమాధానం దొరికింది.

ఈ అమ్మాయి మంచి మనిషి! గొప్ప వ్యక్తిత్వం కలది! జీవితంలో విధి చేసిన కొన్ని లోపాల వలన ఉత్తమ గుణాలు కల మనిషిని వదులుకోకూడదు! ఈ అమ్మాయిని తను మనస్ఫూర్తిగా కోడలుగా స్వీకరించగలదు!

కానీ, కొడుకు ఏం చేస్తాడు?

మగవాడి అహం ఒప్పుకుంటుందా?

"రామూ! అమ్మాయి చెప్పేది సబబుగానే ఉంది. మనవైపు అభ్యంతరాలు రెండే. కుటుంబ గౌరవం కాపాడాలి, నీ భార్య అయ్యాక ఇంక నీ గురించే ఆమె ఆలోచించాలి. ఈ రెండింటికీ సరియైన సమాధానం ఆలోచిస్తే ఇంక పెళ్లికి నాకేం అభ్యంతరం లేదు" అంది పార్వతి.

*భార్య: ఏమిటండీ మన చంటిది ఎంత చెప్పినా బట్టలు వేసుకోవడం లేదండీ. ఒక్క చెడ్డీ మాత్రమే వేసుకు తిరుగుతోంది.*

*భర్త: కంగారుపడకే. పెద్దయ్యాక నెంబర్ 1 హీరోయిన్ అవుతుందిలే.*

*ఎస్.విజయ (జమ్ షెడ్‌పూర్)*

మైథిలి కళ్లు చెమర్చాయి.

తను విధవ అన్న విషయానికి వీళ్లు అభ్యంతరం తెలుపట్లేదు. ఫర్వాలేదు!

"డబ్బు కోసమే డాన్స్ చేస్తున్నావంటే ఆ డబ్బు నే నిస్తే డాన్స్ మానేస్తావా?" అన్నాడు శ్రీరామ్.

మౌనంగా తల ఊపింది మైథిలి.

"ఒక గొడవ వదిలిపోయింది అమ్మా!" అన్నాడు శ్రీరామ్.

"డాన్స్ స్కూల్ మాత్రం నేను ముయ్యడం, అమ్మడం లాంటివి చెయ్యను." దృఢంగా పలికింది మైథిలి.

శ్రీరామ్ తల పట్టుకున్నాడు.

పార్వతికి జాలి వేసింది. తను సచ్చజెప్పాల్సిన సమయం వచ్చింది. తను పెద్దరికం చూపాలి ఇప్పుడు!

"శ్రీరామ్! మైథిలి తన భర్తని ప్రేమించలేదని చెప్తోంది. నువ్వు ఆమెని పెళ్లి చేసుకోవడానికి ఆ ఒక్క మాట చాలు. డాన్స్ స్కూల్ ముయ్యను అనడం నిన్ను ధిక్కరించడం అనుకోకు. అది ఆమె కృతజ్ఞతతో చేస్తున్న పని. ఈ పని ఈ అమ్మాయిలోని ఒక సుగుణాన్ని నిరూపిస్తోంది. ఈనాడు ఎంతమంది కృతజ్ఞత చూపించడానికి ఎంతకైనా తెగించగలుగుతున్నారు చెప్పు? స్వార్థం కోసం ఆమె తను ఇచ్చిన మాట నిలుపుకోకుండా గాలికి వదిలేయడం లేదు. ఇది మెచ్చుకోదగిన గుణం. ఇంక నువ్వనే కుటుంబ గౌరవం సంగతి గురించి చెప్తాను విను. ప్రతి మనిషి జీవితంలో ఎందరో వ్యక్తులు కలుస్తారు, విడిపోతారు, లేదా ప్రక్కనే ఉంటారు. కొందర్ని విడిపోయినా మర్చిపోలేం, మర్చిపోకూడదు. కొందరు ప్రక్కనే ఉన్నా భరించలేము, విదిలించుకోలేము. జీవితమంటే ఇదే.

"చెడ్డని మర్చిపోవడంలో, త్రెంచుకోవడంలో అర్థ ముంది. మంచిని పెంచడంలో మానవత్వం ఉంది.

"ఇప్పుడు నీ భార్య తమ్ముడో, అన్నో పోనీ పూర్వపు భర్తో ఒక త్రాగుబోతో, ముండలముఠాకోరో, దొంగో అయితే వాడిని మర్చిపొమ్మనడంలో అర్థ ముంది. కానీ, అదే వ్యక్తి ఒక ఆదర్శవాది, ఉత్తముడు, పరోపకారి అయితే అతను మరణించినా అతని జ్ఞాపకార్థం చేసే పనులకి ప్రోత్సాహం చూపడంలోనే నీ ఔన్నత్యం కనబడుతుంది. అందుచేత డాన్స్ స్కూల్ ముయ్యమని బలవంతం చెయ్యకు, పంతం పట్టకు. ఆమెను ప్రోత్సహించు. ఎవరు చెప్పగలరు నీ ప్రవర్తన ఇతరులకి ఆదర్శం కావచ్చు! ఇలాంటి సమస్యతో మథనపడుతున్న వాళ్లకి సమాధానం చూపవచ్చు. ముందుకు వచ్చి మైథిలిని చేపట్టు. చాదస్తాలతో వెనుకబడకు. అప్పుడే పెద్దమనుషులు నలుగురూ మెచ్చుకోగలరు" అంది పార్వతి గంభీరంగా.

శ్రీరామ్ కళ్లు మెరిశాయి.

"బాగా చెప్పావమ్మా! అలాగే చేస్తాను. ఏం మైథిలీ, పెళ్లి చేసుకుందామా?" అన్నాడు.

"మరి లోకం అనే మాటలు? వాటికి ఏం చేస్తారు?" అంది మైథిలి.

"లోకులు పలుకాకులు. మంచి చేసినా, చెడు చేసినా వాళ్లు వాగుతూనే ఉంటారు. మంచి అంటే వింటాను. చెడు అంటే చెత్తలా తీసి పారేస్తా నరేనా. ఏ మంటావ్?" అన్నాడు శ్రీరామ్.

"ఏ మంటాను? మీలాంటి మంచి మనుషులకి మనస్ఫూర్తిగా ముందు దణ్ణం పెడతాను" అంది మైథిలి.

ప్రేమతో ఆమెని లేవనెత్తారు తల్లీ కొడుకులు.

★

